# ఆదివాసీ బిడ్డను ఆశీర్వదించండి



కరపత్రాలు ఇస్తున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి

నార్నూర్, నవంబర్17: ఆదివాసీ బిడ్డను ఆశీర్వదించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి కోరారు. శుక్రవారం గాదిగూడ మండలంతో పాటు లోకారి, పర్సువాడ, సారుగూడ, అర్జుని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఇతర పార్టీల మోసపూరిత మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళ– రాజేశ్వర్, వైస్ఎంపీపీ యోగేశ్, మండలాధ్యక్షుడు పూసం బాదిరావ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు మద్దతు తెలిపిన ఓయూ జేఏసీ



మాట్లాడుతున్న ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్చాల దత్తాత్రి

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 17 : ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో ముందుంచడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్చాల దత్తాత్రి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగు రామన్న గెలుపు కోసం గడపగడపకూ ఓయూ జేఏసీ ప్రచారం చేస్తామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు శ్రీనివాసాచారి, పాండు జాదవ్, మల్లెల స్వామి, వంశీకృష్ణ, సత్యపాల్, విద్యార్థి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రాజశ్యామల యాగం



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న దంపతులు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 17 : జిల్లా వాసులు సుభిక్షంగా జీవించాలని కోరుతూ, లోక కల్యాణార్థం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న నివాసంలో రాజ శ్యామల, చండీ యాగం నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రతువు వేద పండితులు దూబె సాయికృష్ణ శర్మ తంత్రి, ఉప్పల సంతోష్, వైభవ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య భక్తిప్రపత్తుల నడుమ సాగింది. జోగు రామన్న సతీసమేతంగా హోమాది క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రిమ్స్ ఆవరణలో గల మహా గణపతి ఆలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని గోమాలకు సపర్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న మాట్లాడుతూ ప్రజలంతా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ యాగం జరుపుతున్నట్లు తెలిపారు. దూబె సాయి కృష్ణ శర్మ తంత్రి, ఉప్పల సంతోష్, వైభవ్ శర్మల, కొమురరాజు, బండారి సతీశ్ పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

ఇంద్రవెల్లి, నవంబర్ 17: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, ఓటర్లు ప్రలోబాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్, ధనోరా(బీ) గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కమాండెంట్‌లు కమలేశ్, మేనోన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటుహక్కును వినియోగించుకోవాలి

ఇంద్రవెల్లి, నవంబర్ 17: ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సెక్టార్ అధికారి రాథోడ్ శ్రావణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, బుద్ధనగర్, భీంనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల నియమాలతో పాటు ఓటుహక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుత్‌లెవల్ అధికారులు సుశీలబాయి, నందాబాయి, సులోచనబాయి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు



ఆదిలాబాద్‌రూరల్ : ఇస్త్రీ చేస్తూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 17 : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగి, చించుఘాట్, జండగూడ, న్యూచించుఘాట్, చిన్న చించుఘాట్, మాలెబోరిగాం, టెక్డిగూడ, కేబీ కాలనీ, దర్మగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల తీరును వివరించారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. రోడ్ షోలతో పాటు గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ ప్రచారంలో ముందుకు సాగారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, జిట్ట రమేశ్, బొమ్మకంటి రమేశ్, రమణ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్ : ముస్లింలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

### బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 17 : రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ మజీద్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా పోరాటం

ఎదులాపురం, నవంబర్ 17 : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీసుకుంటున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పదవిలో ఉండి ఒక సామాజికవర్గానికి అనుకూలంగా మాట్లాడుతూ రాజకీయ లబ్ధిపొందాలను కోవడం శోచనీయమన్నారు. ఈ నెల 19 తేదీన జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో ఉదయం 11 గంటలకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుర్గే నారాయణ, శోభాతాయి తుల్జాపూరే, వరప్రసాద్, రమేశ్, శ్రీనివాస్, కాంతారావు, సులోచన, కమలాబాయి, జయశీల, చిల్కా అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

ఎదులాపురం, నవంబర్ 17 : ఆదిలాబాద్ పట్టణం, మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం డీఎస్పీ వీ ఉమేందర్‌తో కలిసి ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. బొక్కలగూడ, ఖానాపూర్, మహాలక్ష్మివాడ, మావల ప్రాంతాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి సంఘటనలు, అసాంఘిక చర్యలు చేపట్టకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటు హక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కువ సంఖ్యలో బైండోవర్లు నిర్వహిస్తూ ఉండాలని సీఐ, సెక్టార్ ఎస్ఐ, డయల్ 100 సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐలు కే సత్యనారాయణ, ఏ అశోక్, మావల ఎస్ఐ వీ విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని కేసు



ఎదులాపురం,నవంబర్ 17: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ఆదిలాబాద్ పట్టణం రాంనగర్‌లోని ఒక ఇంట్లో బుధవారం రాత్రి 11 గంటలకు కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులతో కలిసి వెళ్లి సమావేశం నిర్వహించారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ఎలా ప్రచారం చేస్తారంటూ ఆయను చుట్టుముట్టి నిలదీశారు. సమాచారం అందుకున్న మావల పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్ది, కంది శ్రీనివాస్ రెడ్డిని అక్కడి నుంచి పంపించేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రచారం చేస్తున్నందుకు ఆయనపై కేసు నమోదుచేసినట్లు మావల ఎస్ఐవి. విష్ణువర్ధన్ తెలిపారు.

## పాదరక్షలు లేకుండా దీక్ష



జోగు రామన్న వీరాభిమాని వెంకన్న

జైనథ్, నవంబర్ 17: అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న భారీ మెజార్టీతో గెలవాలని మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన మాదస్తు వెంకన్న కాళ్లకు చెప్పులు లేకుండా గడ్డం, మీసం తీయకుండా నెల రోజుల నుంచి దీక్ష చేపట్టారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా జోగు రామన్న గెలిచిన తర్వాత, రామన్న కుటుంబ సభ్యులతో మాకోడ గ్రామంలో తన ఇంట్లో సత్యనారాయణ స్వామి పూజ చేసి దీక్షను విరమించనున్నట్లు ఆయన తెలిపారు.